

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 10-09-2025 | సంపుటి : 07 | సంచిక : 121 | పేజీలు : 8 | వెల : రూ 3-00


## ఇంద్రకీలాద్రిపై 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

### సిఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందచేత



విజయవాడ,సెప్టెంబర్9: ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయం శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతోంది.. అయితే, దసరా మహోత్సవాలకు హాజరు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం అధికారులు, అర్చకులు.. ఆహ్వానించారు. క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన అధికారులు, అర్చకులు.. ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా అర్చకులు సీఎం చంద్రబాబును ఆశీర్వదించి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దుర్గ గుడి ఈవో శీనా నాయక్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, అర్చకులు పాల్గొన్నారు. కాగా, బెజవాడ దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంపై ఆంధ్రప్రదేశ్ సర్కార్ ఫోకస్ పెట్టింది. దసరా మహోత్సవాల ప్రణాళికలు, భక్తుల రద్దీ నిర్వహణ, క్యూ లైన్లు, భద్రతా ఏర్పాట్లు-, పార్కింగ్, త్రాగునీరు, వైద్య సహాయం, శానిటేషన్ వంటి అంశాలపై ఇప్పటికే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్షించారు. అన్ని విభాగాలు పరస్పరం సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అమ్మలగన్నయమ్మ.. ఆమహాశక్తి.. విజయవాడ దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను వేగవంతం చేశారు అధికారులు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మహోత్సవాల కోసం చేపడుతున్న ఏర్పాట్లు-, భక్తుల రద్దీకి అనుగుణంగా వేసిన ప్రణాళికలపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి దిశానిదేశం చేశారు. సెప్టెంబర్ 22 నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ ఏడాది పదకొండు రోజుల పాటు-, అమ్మవారు పదకొండు రకాల శోభాయమాన అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. లక్షలాదిగా భక్తులు ఈ ఉత్సవాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే గెలుపు

### భారత ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఎన్నిక..



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే కూటమికే గెలుపు సొంతమైంది. నూతన ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ భారీ విజయం సాధించారు. ఇండీ కూటమి నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేసిన బి.సుదర్శన్‌రెడ్డి(ఈ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇవాళ(మంగళవారం) భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఈ సాయంత్రం 5 గంటలకు ముగియగా, ఓట్ల లెక్కింపు అనంతరం రాత్రి 7:30 గంటలకు ఫలితాలు వెలువరించారు.ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా.. ఇండీ కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ 152 ఓట్ల మెజారిటీతో భారీ విజయం సాధించారు. మొత్తంగా 781 అర్హులైన ఎంపీలలో 767 మంది ఓటు వేశారు. ఇది 98.2 శాతం ఓటర్ టర్నౌట్‌ను సూచిస్తోంది. ఈ విజయం ఆయన రాజకీయ అనుభవాన్ని, ఎన్డీఏ కూటమి బలాన్ని ప్రతిబింబించింది. అదే సమయంలో కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు క్రాస్-ఓటింగ్ చేయడం వల్ల ప్రతిపక్ష పార్టీలో చీలికలు ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించాయి.ఎన్డీఏ అభ్యర్థి, ప్రస్తుత మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఆయన, తన ప్రత్యర్థి ఇండియా బ్లాక్ అభ్యర్థి బి సుదర్శన్ రెడ్డిని సునాయాసంగా ఓడించారు. మొత్తం 767 ఓట్లలో రాధాకృష్ణన్ 452 ఓట్లు సాధించగా, ప్రత్యర్థి, ఇండీ కూటమి అభ్యర్థి 300 ఓట్లు సాధించారు. కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు క్రాస్-ఓటింగ్ చేయడం వల్ల ప్రతిపక్షపార్టీలో చీలికలు కనిపించాయి.అర్హత కలిగిన 781 మంది ఎంపీలలో, 767 మంది ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 98.2 శాతం ఓటింగ్ నమోదైంది. 752 ఓట్లు చెల్లుబాటు కాగా, 15 చెల్లవని రిటర్నింగ్ అధికారి పిసి మోడి విలేకరుల సమావేశంలో ప్రకటించారు.

## నాలుగు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు

అమరావతి, సెప్టెంబర్ 09: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను నాలుగు దశల్లో జరుపుతామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వెల్లడించారు. మంగళవారం నాడు అమరావతిలో ఎస్ఈసీ నీలం సాహ్ని మాట్లాడుతూ.. ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వంతో సంప్రదిస్తామన్నారు. అయితే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలను వాడారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఇక ఈవీఎంల కొనుగోలు, వినియోగంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.మరోవైపు ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలను మూడు నెలల ముందుగానే అంటే.. 2026, జనవరిలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుంది. ఐదేళ్ల పదవీ కాలం ముగియడానికి మూడు నెలలు ముందుగా ఎన్నికల నిర్వహణకు చట్టంలో ఉన్న వెసులుబాట్ల మేరకు ఏర్పాట్లు చేయాలని భావిస్తోంది. ఈ మేరకు పంచాయతీరాజ్, పురపాలక శాఖ కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఇటీవల లేఖలు రాశారు.నగర పాలక, పురపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీ కాలం 2026, మార్చిలో.. అలాగే సర్పంచుల పదవీ కాలం సైతం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ముగియనుంది. దీంతో మూడు నెలలు ముందే ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన లేఖలో తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఇలా..

2025 అక్టోబర్ 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి.

అక్టోబర్ 16 నుంచి నవంబర్ 15లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ప్రచురించాలి.

నవంబర్ 1 నుంచి 15వ తేదీలోగా ఎన్నికల అధికారుల నియామకం పూర్తి చేయాలి.

నవంబర్ 16 నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాలు ఖరారు, ఈవీఎంలు సిద్ధం చేయడం, సేకరణ వంటివి పూర్తి చేయాలి.

డిసెంబర్ 15లోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలి.

డిసెంబర్ చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి.

చివరకు అంటే.. 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి.. అదే నెలలో ఫలితాలు ప్రకటించాలి.

## యూరియాపై వైసీపీది అసత్య ప్రచారం.. మంత్రి సుభాష్ ఫైర్

అమరావతి, సెప్టెంబరు9: యూరియాపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. వైసీపీ ప్రతిపక్షం కాదు విషవృక్షమని విమర్శించారు. ఏపీలో యూరియా కొరత ఉందని చెప్పడం పూర్తిగా అవాస్తవమని అన్నారు. కేవలం రైతులను భయాందోళనలకు గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే వైసీపీ నేతలు విష ప్రచారానికి తెరలేపారని ధ్వజమెత్తారు.జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ప్రతి ఏడాది సగటున 5 లక్షల టన్నుల యూరియా (జతీవజీ) మాత్రమే రైతులకు అందించారని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఖరీఫ్ సీజన్‌లో 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఇప్పటికే ఆగస్టు నెలాఖరు నాటికి 5,69,712 టన్నులు, ఈ నెలలో 94,482 టన్నులు సరఫరా చేశామని స్పష్టం చేశారు. మరో 40 వేల మెట్రిక్ టన్నులు ఈ నెల 10వ తేదీలోగా రైతులకు చేరనుందని వెల్లడించారు మంత్రి వాసంశెట్టి సుభాష్.యూరియా కొరత ఉందంటూ తప్పుడు కథనాలతో కృత్రిమ కొరతను సృష్టించడం వైసీపీ (జూఖీఅఖ) దిగజారుడుతనానికి నిదర్శనమని నిప్పులు చెరిగారు. గత ఐదేళ్లలో వ్యవసాయ రంగాన్ని జగన్ రెడ్డి పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

## మహానంది ఆలయం నుంచి వినాయకునికి పట్టువస్త్రాలు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 09-కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారికి జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది క్షేత్రం తరపున సాంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి గారు ప్రత్యేకంగా పాల్గొని వినాయకునికి పట్టువస్త్రాలు సమర్పించారు.ఈ వేడుకలో ఏఈఓ, సూపరింటెండెంట్లు, ఇన్స్పెక్టర్లు, వేదపండితులు, ప్రధాన అర్చకులు, అర్చకులు భాగస్వామ్యం చేసి ఘనతను చాటారు. మహానంది నుంచి వచ్చిన ఈ సమర్పణతో బ్రహ్మోత్సవాలకు మరింత వైభవం చేకూరిందని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించండి....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెప్టెంబర్ 9 రాష్ట్ర విద్యుత్ జేఏసీ ఆదేశానుసారం డోన్ టౌన్ డివిజన్ జేఏసీ చైర్మన్ రామకృష్ణ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లేనియెడల ప్రత్యక్ష పోరాటాలు తప్పవని డివిజనల్ ఇంజనీర్ కమలాకర్ రావు కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగదు రహిత వైద్యం, పాత పెన్షన్ విధానం, అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు 2022 పిఆర్సి బకాయిలు చెల్లించాలని లేని యెడల ఈనెల 15 తారీకు నుంచి ప్రత్యక్ష పోరుకు దిగుతామని జేఏసీ చైర్మన్ రామకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు ఏఈలు నాగేశ్వర్ రెడ్డి, రేఖ,జె ఏ ఓలు ఆదిలక్ష్మి, రమేష్,లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకట రాముడు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ - సూపర్ హిట్ విజయోత్సవ సభను సూపర్ సక్సెస్ చేయండి...



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెప్టెంబర్ 9 తెలుగుదేశంపార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు 10వ తేది అనంతపురంలో జరుగు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు రాప్తాడు నియోజకవర్గంకు మొబిలైజేషన్ అబ్జర్వర్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ని నియమించడంతో వారు మంగళవారం రాప్తాడు నియోజకవర్గం, ఆత్మకూరు మండలం కేంద్రంలో స్థానిక రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, అబ్జర్వర్ గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనంతపురంలో జరుగు సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ కు క్షేత్రస్థాయిలో జనసమీకరణ చేసి ఆత్మకూరు మండలం నుండి పెద్ద ఎత్తున కదలి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క కూటమి నాయకులు , క్లస్టర్ , యూనిట్, బూత్ ఇంఛార్జులు భాద్యతగా తీసుకుని నారా చంద్రబాబు నాయుడు పర్యటన సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ ను సూపర్ సక్సెస్ చేయాలని కోరుతున్నామని అన్నారు.




# సంపాదకీయం

బుధవారం 10-09-2025

## లక్ష్యం చేరని సంపూర్ణ అక్షరాస్యత

ఏ దేశమైనా అక్షరాస్యతను కలిగివుంటేనే అభివృద్ధి చెందుతుంది. దేశంలో నిరక్ష్యరాస్యతను తొలగించిన నాడే పురోగమిస్తుంది. ప్రతి ఏటా సెప్టెంబర్ 8వ తేదీని 'అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే సంపూర్ణ అక్షరాస్యత విషయంలో కేంద్ర,రాష్ట్రాలు ఇంకా పూర్తిస్థాయిలో కృషి చేయడం లేదు. గ్రామాల వారీగా అక్షరాస్యతకు కృషి చేయడం లేదు. నవంబర్ 17, 1965 సంవత్సరంలో యునెస్కో సభ్యదేశాల విద్యాశాఖ మంత్రుల మహాసభ అనంతరం అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రకటించగా 1966 నుండి జరుపుకుంటున్నాం. అక్షరాస్యత అంటే సాంప్రదాయకంగా భాషను ఉపయోగించేందుకు అవసరమైన చదవటం, రాయటం, వినటం, మాట్లాడటం అనే నాలుగు ప్రాథమికాంశాలు తెలుసుకోవటాన్నే అక్షరాస్యత అనవచ్చు. అయితే మనిషి దైనందిన జీవితంలో ఈ రాయడం, చదవటం మాత్రమే అక్షరాస్యత అనేది కాదనీ, అక్షరాస్యత అంటే మనిషి గౌరవం, అవకాశాలు, అభివృద్ధి గురించి చెప్పడమే నిజమైన అక్షరాస్యత అని కొంతమంది పెద్దలు చెబుతుంటారు. ఉన్నతమైన జీవనానికి ప్రపంచం అన్నిరంగాల్లో ముందుకు సాగేందుకు విద్య, విజ్ఞానం ఎంతో అవసరం. అయితే ప్రపంచంలో కొన్ని దేశాలు వెనుకబడి ఉండడానికి నిరక్షరాస్యత ముఖ్యకారణం. అలా వెనకబడిన దేశాలను ముందుకు తీసుకురావడానికే అక్షరాస్యతను శాతాన్ని పెంచాలి. ఇది పిల్లల్లోనే కాకుండా వయోజన విద్య మీద కూడా కేంద్రీకరించబడింది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం అగాధంలో వున్నట్లే చెప్పవచ్చు. ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే దానిక్కారణం కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుం డటం తప్ప మరోటి కాదు. అనేక రాష్ట్రాలు సగటు అక్షరాస్యతా శాతానికి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. మొత్తం మీద ప్రపంచ నిరక్షరాస్యుల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. గతంలో వయోజన విద్యకు ప్రాధాన్య ఇచ్చేవారు. ఈ మధ్య అది కనిపించడం లేదు. ప్రతి ఒక్కరిని అక్షరాస్యులను చేయాలన్న సంకల్పం యేరకు గ్రామస్థాయిలో సర్వేచేసి పిల్లలను బలవంతంగా స్కూళ్లకు చేర్చారు. అలాగే పనిప్రదేశాల్లో బాలకార్మికులను లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలన పెంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా, కేవలం అక్షరజ్ఞానం కలిగించేలా చూడాలి. ఏటా ఉత్సవాలు జరపడంతో పాటు చేస్తున్న కృషికి అనుగుణంగా అక్షరాస్యత పెరిగిందా లేదా అన్నది బేరీజు వేసుకోవాలి.స్థిరమైన ఆర్థికాభి వృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధిం చాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన 79ఏళ్లు గడుస్తున్నా సంపూర్ణ అక్షరాస్యతను సాధించలేదు. అందరూ చదివినప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం అగాధంలో వున్నట్లే చెప్పవచ్చు.ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే దానిక్కారణం కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుండటం తప్ప మరోటి కాదు. ప్రపంచ నిరక్షరాస్యు ల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించాల్సిన అవసరం ఉంది. ప్రధానగా విద్యారంగం పట్ల కేంద్ర, రాష్ట్రాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ కేటాయింపును తగ్గించేస్తున్నాయి. జనాభాకు అనుగుణంగా విద్యారంగ అభివృద్ధి జరగడం లేదు. విద్యారంగంలో విప్లవం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా..మార్పులు మాత్రం కానరావడం లేదు. ఎందుకనో పాలకులు ఎవరు అధికారంలో ఉన్నా ఈ రంగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫీజుల దోపిడీపై గళమెత్తు తున్నా పట్టించుకోవడం లేదు.కార్పొరేట్ స్కూళ్ల పేరుతో చేస్తున్న దోపిడీ అంతాఇంతా కాదు. తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక పట్టాలకెక్కడం లేదు. ఎపిలో జగనన్న విద్యా కానుక తప్ప స్కూళ్ల బలోపేతం జరగలేదు. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చదివిన వారు మత్రమే టాపర్స్‌గా నిలుస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో గమనించాలి. దీనివెనక ఏదైనా గూడుపుఠాణి ఉందా అన్నది బయటపెట్టాలి. ప్రభుత్వ రంగంలో ప్రాథమిక విద్యకు బలమైన పునాదులు పడాలి. అలాగేకార్పోరేట్ దోపిడీని అరికటటాలి. అప్పుడే విద్యారంగం విస్తృతం కాగలదు. సామాన్యుడి నుంచి, రాజకీయనాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యావిధానంలో చదవాలన్న ఆకాంక్ష అమలు కావడం లేదు. విద్యాభివృద్దిలో కులరహిత హాస్టళ్లు ఉండకూడదు. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. అయితే ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉండగానే గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్లు ప్రారంభించడం, అనేక హాస్టళ్లను కొత్తగా చేప్టటడం వల్ల సమగ్ర విద్యాపథకం అటకెక్కిందనే భావించాలి. సమగ్రమైన విద్యతో పాటు, విద్యార్థి అన్ని రంగాల్లో రాటుదేలేలా విద్యా సంస్కరణలు రావాలి. ప్రతి ఒక్కరూ చదవడం,రాయడం లక్ష్యంగా ముందుకు సాగాలి. కనీసం పేపర్ చదవగలిగేలా చేయాలి. ఇంటర్‌నెట్ విస్తృతి పెరిగినా ప్రభుత్వ ప్రోత్సాహం దక్కడం లేదు. అయితే గతంతో పోలిస్తే విద్యారంగం లో అనేక విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి.

## డబ్ల్యూటిఐటిసి ఇల్లినాయిస్ రాష్ట్ర చాప్టర్ అధ్యక్షుడిగా చికాగోకు చెందిన టెక్ లీడర్ రామకోటేశ్వర రెడ్డి వీరంరెడ్డి నియామకం

విభారే. న్యూస్ నెట్వర్క్ హైదరాబాద్/చికాగో, సెప్టెంబర్ 8, 2025: వటిటీసీ ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి ( డబ్ల్యూ టి ఐ టి సి ) అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాల నేతృత్వంలో ఆ సంస్థ చికాగోలోని ప్రముఖ టెక్ నేత రామకొటేశ్వర రెడ్డి వీరంరెడ్డి ని ఇల్లినాయిస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడాన్ని ప్రకటించింది. ఈ నియామకం డబ్ల్యూ టి ఐ టి సి యొక్క గ్లోబల్ మిషన్‌కు బలాన్ని చేకూర్చడమే కాదు, ప్రపంచవ్యాప్తంగా తెలుగు టెక్ నిపుణులకు శక్తి కల్పించడానికీ దోహదపడుతుంది."చికాగోకు కేంద్రంగా ఉండే సీవీటెక్ ఇన్నోవాషన్స్ వ్యవస్థాపకులు మరియు సీఈఓ అయిన రామకొటేశ్వర రెడ్డి వీరంరెడ్డి కి ఈ ఆర్ పి సి ఆర్ ఎం , ఒరాకిల్, జుర వంటి ప్లాట్‌ఫారమ్‌లలో 20 సంవత్సరాలకు పైగా అనుభవం ఉందిళ18. ఆయన నాయకత్వంలో సీవీటెక్ ఇన్నోవాషన్స్ అమెరికా మరియు భారతదేశం అంతటా విశ్వసనీయ ఐటీ సేవల సంస్థగా ఎదిగింది. మాన్యుఫ్యాక్చరింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, రిటైల్, టెలికాం, టెక్నాలజీ సేవలు వంటి విభాగాల్లో సంస్థ ఎండ్-టు-ఎండ్ సొల్యూషన్లు అందిస్తోంది. క్లౌడ్, ఏఐ రంగాల్లో కూడా సంస్థ ముందుంది. డబ్ల్యూ టి ఐ టి సి అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాల మాట్లాడుతూ:"విజన్, అంతర్జాతీయ అనుభవం కలిగిన రామకొటేశ్వర రెడ్డి నాయకత్వం డబ్ల్యూ టి ఐ టి సి మిషన్‌ను అమెరికాలో మరింత ముందుకు తీసుకెళ్లుతుంది. మధ్య పశ్చిమ ప్రాంతాల్లో తెలుగు టెక్ నిపుణులతో అనుసంధానాన్ని పెంచడం, సహకారం, ఇన్నోవేషన్, వృద్ధి కోసం కొత్త అవకాశాలు పొందడం మెరుగవుతుంది."ఎ డబ్ల్యూ టి ఐ టి సి ఎన్నారైఎ (టెక్సస్, యూఎస్ఏ ) జాయింట్ సెక్రటరీ డి. రామా రావు అభినందనలు తెలియజేస్తూ:" డబ్ల్యూ టి ఐ టి సి ఇల్లినాయిస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రామకొటేశ్వర రెడ్డికి హృదయపూర్వక అభినందనలు. వారి నాయకత్వం, టెక్నాలజీ ఆధారిత మార్పు పై కమిట్‌మెంట్ మరింత మంది తెలుగు ప్రొఫెషనల్స్ కు ప్రేరణ కల్పిస్తుంది. డబ్ల్యూ టి ఐ టి సి గ్లోబల్ విజన్‌ను ముందుకు తీసుకెళ్ళడంలో కలిసి పని చేసే అవకాశం కోరి చూస్తున్నాను."రామకొటేశ్వర రెడ్డి వీరంరెడ్డి మాట్లాడుతూ:" డబ్ల్యూ టి ఐ టి సి ఇల్లినాయిస్ అధ్యక్షుడిగా పనిచెయ్యడం గొప్ప గౌరవం. చైర్మన్ సందీప్ కుమార్ మక్తాల, కౌన్సిల్ నాపై చూపిన అభిమానం అభినందించాల్సిందే. ఇల్లినాయిస్ లో తెలుగు ఐటీ కమ్యూనిటీని బలోపేతం చేయడంలో, ప్రపంచంతో కలిసికట్టుగా ముందుకు పోవడంలో, ఇన్నోవేషన్, ఇంటర్‌ప్రెన్యూర్‌షిప్, ప్రొఫెషనల్ గ్రోత్ లో అవకాశాలు కల్పించడంలో కలిసి పని చేస్తాం."ఈ నియామకం డబ్ల్యూటిఐటిసి యొక్క అంతర్జాతీయ లక్ష్యాన్ని మరోసారి స్పష్టంచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు మాట్లాడే ఐటి నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఆవిష్కరణలు, పెట్టుబడులు, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం పై సంస్థ కమిట్మెంట్‌ను ప్రతిబింబిస్తుంది.




# కుందూ కు కృత్రిమ వరదలు

**-రైతు పొలాలు జలమయం**

**వెలుగోడు గేట్ల నీటి విడుదల ఆపాలని బొజ్జా విజ్ఞప్తి**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 09:--పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి విడుదల చేస్తున్న కృష్ణా జలాలను కుందూనదిలోకి అధికంగా మళ్లించడం వలన రైతుల పంటలు మునిగి పోతున్నాయని, ఇప్పటికైనా నీటి విడుదల తగ్గించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గారికి విజ్ఞప్తి చేశారు.వరదలతో ముంపుకు గురైన పాములపాడు, కోవెలకుంట్ల, పెద్దముడియం మండల రైతులతో కలిసి కలెక్టర్‌ను కలసిన బొజ్జా, ముంపు సమస్యలు, పంట నష్టాలు, పొలాల ఉప్పలమయం వంటి సమస్యలను వివరించారు. వెలుగోడు రిజర్వాయర్ స్పిల్ గేట్ల నుండి గాలేరు నదిలోకి నిరంతరం నీరు విడుదల చేయడం వలన కుందూనది పరీవాహక ప్రాంతంలో వరదలతో పాటు స్పిల్ గేట్ల భద్రతకే సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కృష్ణా జలాలను ఎన్ ఆర్ బి సి కాలువకు చేరకుండా శాశ్వతంగా మూసివేసిన అంశంపై కూడా ప్రభుత్వానికి నివేదిక పంపాలని బొజ్జా కలెక్టర్‌ను కోరారు. రైతుల నష్టానికి పరిహారం చెల్లించేందుకు రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కూడా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యన్. రెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి, ప్రచార కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు, కృష్ణమోహన్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎం.సి.కొండారెడ్డి, రైతు నాయకులు వెంకటేశ్వర్లు, చిన్న ఆవులరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాత పోరుబాటలో- యూరియా

**--- గిట్టుబాటు ధర కోసం రోడెక్కిన రైతన్నలు**

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 09-నంద్యాల జిల్లా రైతులు యూరియా కోసం, గిట్టుబాటు ధర కోసం రోడెక్కారు. బస్తా ఎరువుకోసం గంటల తరబడి క్యూలో నిలబడి కష్టాలు పడుతున్న రైతులకు సరిపడా యూరియా అందక సాగు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా, కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టే వ్యవహరిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, రైతు సంఘాలు రైతులకు అండగా నిలిచి, నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఉల్లికీ గిట్టుబాటు ధర, యూరియా కొరత లేకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పలు వైసీపీ నేతలు, రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.వైసీపీ నేతలు మాట్లాడుతూ?రాష్ట్రంలో గత రెండు నెలలుగా యూరియా కొరతతో రైతులు రోడెక్కుతున్నారని, ప్రభుత్వం మాత్రం నిల్వలు ఉన్నాయని చెబుతోందని విమర్శించారు. నిజంగా యూరియా ఉంటే రైతులు ఎందుకు ఇంత ఇబ్బందులు పడుతున్నారని ప్రశ్నించారు. ఉల్లిధర క్షీణించినా మద్దతు ధర ఇవ్వలేకపోయారని, రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు అండగా ఎప్పటికీ నిలుస్తామని, రైతు న్యాయం కోసం ఎంతదూరమైనా వెళ్తామని వైసీపీ నేతలు స్పష్టం చేశారు.



# నంద్యాల మండలంలో 1320 పొదుపు సంఘాలు--

**20 కోట్ల రుణాల పంపిణీ---**

**నలుగురు సీసీలు, 47 మంది బుక్ కీపర్లు-**

**అవకతవకలకు తావు ఇస్తే కఠిన చర్యలు**

**: ఏపీఎం రామ్ శేఖర్ రెడ్డి--**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 09-నంద్యాల మండలంలో మొత్తం 1320 పొదుపు సంఘాల గ్రూపులు, నలుగురు సీసీలు, 47 మంది బుక్ కీపర్లు ఉన్నారని మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రామ్ శేఖర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.గత ఆరు నెలల్లోనే దాదాపు ?20 కోట్లు పొదుపు సంఘాలకు రుణాలుగా అందజేశామని ఆయన వివరించారు. అలాగే ఎవరైనా సీసీలు గాని, బుక్ కీపర్లు గాని అవకతవకలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వితంతువులు ధరఖాస్తు చేసుకోండి---

**బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు---**

విభారె న్యూస్, నంద్యాల, సెప్టెంబర్ 09 :-కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఒక ప్రకటనలో తెలిపారు.ఆయన మాట్లాడుతూ ?భర్త మరణించిన వితంతువుల కోసం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద బాధిత కుటుంబానికి రూ.20,000/- ఆర్థిక సాయం అందించేలా కేంద్రం నిర్ణయించిందని తెలిపారు.అర్హతలు :కుటుంబ పెద్ద 18 నుండి 59 సంవత్సరాల మధ్య వయసులో 12.04.2017 తరువాత మరణించి ఉండాలి.మరణ ధృవీకరణ పత్రం తప్పనిసరి.కుటుంబ వార్షిక ఆదాయం రూ.60,000/- లోపు ఉండాలి.బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జతపర్చాలి.ఇంతకు ముందు "ఆపథ్ బాందు పథకం" కింద ప్రయోజనం పొందకపోవాలి.ఎక్కడ దరఖాస్తు చేయాలి-- :అర్హులైన వారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి.దరఖాస్తు ఫారాలు అన్ని జిరాక్స్ సెంటర్లలో లభిస్తాయి."మీ సేవలో" పోర్టల్‌లో దరఖాస్తు చేయనవసరం లేదని తెలిపారు.ప్రతి అర్హత కలిగిన వితంతువు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలని, ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోవద్దని అభిరుచి మధు పిలుపునిచ్చారు.



## మున్సిపాలిటీలో అధికారుల వింత పోకడలు!---

**ప్రజా పన్నుల దుర్వినియోగం స్పష్టంగా బహిర్గతం--**

విభారె న్యూస్, నంద్యాల మా ప్రతినిధిసెప్టెంబర్ 09, నంద్యాలనంద్యాల మున్సిపాలిటీ అధికారుల తీరుపై ఇప్పుడు ప్రజలలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.ప్రైవేట్ వాహనాలను మూడు అద్దెకు తీసుకుని, వాటిలో రెండు వాహనాలకు మున్సిపాలిటీ నిధులతోనే డీజిల్ నింపిస్తున్నారు. మిగతా ఒక వాహనానికి మాత్రం యజమానియే డీజిల్ పోసుకోవాల్సి వస్తోంది.ఒక్కో వాహనానికి నెలకు రూ.35 వేలు బిల్లులు చెల్లింపులు అవుతున్నాయి. డ్రైవర్లను మాత్రం మున్సిపాలిటీ సిబ్బందినే వాడుతున్నారు.సాధారణంగా ప్రభుత్వ నియమాల ప్రకారం వాహనం యజమానులే డ్రైవర్, డీజిల్ సమకూర్చుకోవాలి. కానీ ఇక్కడ మాత్రం అధికారుల స్వీయ రాజ్యాంగం నడుస్తోంది.ప్రజల చెమటోడ్చిన పన్నులను ఇలా వృథా చేస్తూ, అధికారుల ఈ వింత పోకడలపై పలువురు మండిపడుతున్నారు."ఇది పన్ను దుర్వినియోగం కాదా? ఇలాంటివారిపై చర్యలు ఎందుకు ఉండకూడదు?" అంటూ ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.



## ప్రజల తరఫున నిలబడని మీకు.. ప్రతిపక్ష హోదా ఎందుకు.. జగన్‌పై మంత్రి సంధ్యారాణి ధ్వజం



వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి గుమ్మడి సంధ్యారాణి నిప్పులు చెరిగారు. ప్రజల తరఫున నిలబడి మాట్లాడని జగన్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు అని ఆమె ప్రశ్నించారు. గతంలో టీడీపీకి 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై పోరాటం చేశామని గుర్తుచేశారు. దమ్ముంటే ఈసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని వైసీపీ ఎమ్మెల్యేలకు గుమ్మడి సంధ్యారాణి సవాలు విసిరారు. ప్రజా సమస్యలపై మాట్లాడాలని అనుకుంటే అసెంబ్లీకి వచ్చి జగన్ మాట్లాడాలని హితవు పలికారు. ఏపీ గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదని మంత్రి అన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన ప్రజా వ్యతిరేక పనులతోనే ఎన్నికల్లో ఓడిపోయారని ఆరోపించారు. వైసీపీ హయాంలో సర్పంచ్‌లను పట్టించుకోలేదని.. అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు.

## రాయలసీమలో జగన్‌కు ఒక్క ఓటు కూడా రాదు.. జీవీ ఆంజనేయులు జోస్యం



వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయారని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. వైసీపీ పాలనలో ఆ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించారని అన్నారు. రాయలసీమలో జగన్‌కు ఒక్క ఓటు కూడా రాదని వ్యాఖ్యానించారు. అధికారంలో లేకపోయినప్పటికీ వైసీపీ కుట్ర రాజకీయాలు మానడం లేదని జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. రైతుల ముసుగుతో అన్నదాతలను వైసీపీ దగా చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో యూరియా సంక్షోభం సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. రైతు సమస్యలపై చర్చించే ధైర్యం ఉంటే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ రావాలని సవాలు విసిరారు. అసెంబ్లీలో అడుగుపెడితే వైసీపీ ఎమ్మెల్యేలకు ఒక గంట సమయం ఎక్కువ ఇచ్చేందుకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. ఇక చంద్రబాబు పాలనను జీవీ ఆంజనేయులు ప్రశంసించారు. సంక్షోభాలను సైతం అవకాశాలుగా మార్చుకోవడంలో చంద్రబాబును మించిన వారు లేరని ఆయన అన్నారు. కరవు సీమలో కార్లను పరిగెత్తించిన ఘనత బాబుకే దక్కుతుందని కొనియాడారు. హంద్రీనీవాలో నీళ్లుపారించి సస్యశ్యామలం చేశారని అన్నారు.

## ఏపీలో అభివృద్ధిని చంద్రబాబు పరుగులు తీయిస్తున్నారు : మల్లారెడ్డి

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని ముఖ్యమంత్రి చంద్రబాబు బాగా అభివృద్ధి చేస్తున్నారని తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏపీకి ప్రధాని మోదీ రూ.లక్షల కోట్లు కేటాయిస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని చంద్రబాబు పరుగులు తీయిస్తున్నారన్నారు. నా పుట్టినరోజు నాడు ఏటా స్వామి వారి దర్శనానికి వస్తుంటా. గతేడాది యూనివర్సిటీలు కావాలని కోరుకున్నా. దేశంలోనే 3 పెద్ద డీమ్డ్ వర్సిటీలు నడిపిస్తున్నా. తెలంగాణలో బీఆర్ఎస్ హయంలో పదేళ్లలో దేశంలో ఎక్కడా లేని అభివృద్ధిని కేసీఆర్ చేశారు. హైదరాబాద్‌కు మల్లీ నేషనల్ కంపెనీలను కేటీఆర్ తీసుకొచ్చారు. తెలంగాణలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ పరిస్థితి బాగాలేదు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో అమ్ముకుని హైదరాబాద్ వచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి మొత్తం రివర్స్ అవుతోంది. తెలంగాణ వాళ్లు ఏపీలో ఆస్తులను కొని వ్యాపారాలు చేస్తున్నారు. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తే పాతరోజులు వస్తాయి అని అన్నారు.



## రాయలసీమలో వైసీపీ ఉనికి కూడా లేదు..

### మంత్రి పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు

రాయలసీమలో వైసీపీ పూర్తిగా పట్టుకోల్పోయిందని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాయలసీమలో వైసీపీకి ఉనికి కూడా లేదని విమర్శించారు. అరాచకం, విధ్వంసానికి జగన్.. అభివృద్ధి, సంక్షేమానికి చంద్రబాబు కేరాఫ్ అడ్రస్ అని తెలిపారు. అనంతపురంలో రేపు 'సూపర్ సిక్స్-సూపర్‌హిట్' విజయోత్సవ సభ నిర్వహించనున్న



నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీకి పట్టున్న రాయలసీమలో మరింత పట్టుబిగించేలా చంద్రబాబు సభ ఉండబోతుందని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, చంద్రబాబు, బాలకృష్ణ రాయలసీమ నుంచే ప్రాతినిధ్యం వహించారని పయ్యావుల కేశవ్ గుర్తుచేశారు. టీడీపీకి పట్టు ఉన్న రాయలసీమలో మరింత పట్టుబిగించేలా చంద్రబాబు సభ జరుగుతోందని తెలిపారు. సభవకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందని వ్యాఖ్యానించారు. రాయలసీమలో వైసీపీ జీరోకు పడిపోనుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు జోస్యం తెలిపారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల దెబ్బ నుంచి వైసీపీ ఇంకా కోలుకోలేదని అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు అనంతపురం ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. జగన్ అరాచకాలపై ప్రజలకు ఇంకా కోపం పోలేదని చెప్పారు.

## బీజేపీ అభ్యర్థికి వైసీపీ మద్దతుపై సర్వత్రా విమర్శలు!



భారత ఉపరాష్ట్రపతి ఎన్నికలు ఇప్పుడు దేశంలో హాట్ టాపిక్ గా మారాయి. ఈ ఎన్నికల్లో అధికార ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మద్దతు ప్రకటించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. కాంగ్రెస్ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఏపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్కం ఠాగోర్‌తో సహా పలువురు రాజకీయ నాయకులు జగన్ తీరును తప్పుబడుతున్నారు. జగన్ తప్పు చేస్తున్నారని దుయ్యబడుతున్నారు. బీజేపీపై పోరుకు అవకాశం దొరికినా జగన్ తప్పించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. జగదీప్ ధన్‌ఖడ్ ఊహించని విధంగా పదవి నుంచి తప్పుకోవడంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరఫున మహారాష్ట్ర గవర్నర్, తమిళనాడు బీజేపీ నేత సీపీ రాధాకృష్ణన్ బరిలో నిలిచారు. విపక్ష కూటమి ఇండియా బ్లాక్ తరఫున తెలుగు నేత, మాజీ జడ్జి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అభ్యర్థిగా నిలిచారు. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రాంతీయ పార్టీలు తమ మద్దతును ఎవరికి ఇవ్వాలనే చర్చ ఊపందుకుంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ రాజమహేంద్రవరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు తమ పార్టీ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వంటి రాజ్యాంగబద్ధ పదవులు పార్టీలకు అతీతమైనవని, వాటిని గౌరవించాలని జగన్‌మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ నమ్ముతారని బొత్స వెల్లడించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్వయంగా జగన్‌తో ఫోన్‌లో మాట్లాడి మద్దతు కోరినట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం వైసీపీ రాజకీయ వ్యూహంలో భాగంగా భావించినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమితో (టీడీపీ, జనసేన, బీజేపీ) జగన్ సన్నిహితంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాన్ని బలపరిచింది. 2023లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానంలోనూ జగన్ బీజేపీకి మద్దతు ప్రకటించిన సంగతి గమనార్హం. వైసీపీ నిర్ణయంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ జగన్‌ను లక్ష్యంగా చేసుకొని, ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకమని, వైసీపీ రాజకీయంగా బలహీనపడుతున్న సమయంలో ఎన్డీయేకు మద్దతు ఇవ్వడం జగన్ రాజకీయ అనుభవాన్ని చాటుతుందని వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడుతూ, "వైసీపీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడిన పార్టీ అని జగన్ స్వయంగా చెప్పుకున్నారు. అలాంటప్పుడు, తెలుగు వ్యక్తి అయిన సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వకుండా ఎన్డీయే అభ్యర్థికి మద్దతు ప్రకటించడం ద్వారా జగన్ తన రాజకీయ అవకాశాలను స్వయంగా దెబ్బతీసుకున్నారు" అని ఆరోపించారు. ఏపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్కం ఠాగోర్ కూడా జగన్ తీరును తప్పుబట్టారు. "ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది. అలాంటి సమయంలో వైసీపీ ఎన్డీయేకు మద్దతు ఇవ్వడం అంటే ప్రతిపక్షంగా తమ పాత్రను వదులుకోవడమే. ఇది ప్రజల ఆకాంక్షలకు విరుద్ధం" అని విమర్శించారు. రాజకీయ విశ్లేషకులు జగన్ నిర్ణయాన్ని రెండు కోణాల్లో పరిశీలిస్తున్నారు. జగన్ ఈ నిర్ణయం ద్వారా కేంద్రంలోని బీజేపీ నాయకత్వంతో సన్నిహిత సంబంధాలను కొనసాగించాలని భావిస్తున్నారని కొందరు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తర్వాత, రాజకీయంగా బలహీనపడిన జగన్, కేంద్రంతో సఖ్యత కొనసాగించడం ద్వారా తమ పార్టీని బలోపేతం చేసుకోవాలని చూస్తున్నారని విశ్లేషణ. అయితే, ఈ నిర్ణయం రాష్ట్రంలో ప్రతిపక్షంగా వైసీపీ బలాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని మరికొందరు హెచ్చరిస్తున్నారు. అయితే 2024లో కేవలం 11 సీట్లకే పరిమితం చేసింది ఎన్డీయే కూటమి. అలాంటి కూటమి అభ్యర్థికే ఇప్పుడు జగన్ మద్దతు పలకడం వైసీపీ రాజకీయ భవిష్యత్తును మరింత దిగజార్చే అవకాశం ఉందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసిన టీడీపీ ఎంపీలు

ఉపరాష్ట్రపతి ఎన్నికలో తెలుగుదేశం పార్టీ ఎంపీలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 16 మంది లోక్‌సభ ఇద్దరు రాజ్యసభ ఎంపీలు ఓటు వేశారు. ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కిస్తారు. ఎన్నిక ఫలితం ఈ రాత్రికి వెలువడనుంది.

## అనంతపురం వాసికి.. అమెరికాలో భారీ ప్యాకేజీ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగి శంకర నారాయణ, మీనాక్షిదేవి దంపతుల మనవడు కొప్పు సాయి సాకేత్ అమెరికాలో భారీ ప్యాకేజీతో ఉద్యోగం సాధించాడు. పది వారాలకు రూ.కోటి జీతంతో చికాగోకు చెందిన ఒప్‌టివర్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సాయిసాకేత్ ప్రస్తుతం అట్లాంటాలోని జార్జ టెక్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా ఇటీవల ఇంటర్వ్యూలకు హాజరయ్యాడు. బీటెక్ మరో ఏడాది మిగిలి ఉండగానే భారీ ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సాకేత్ తండ్రి కొప్పు రమేశ్ అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రంలో ఐటీ సైబర్ సెక్యూరిటీ లీడర్‌గా పనిచేస్తున్నారు. ఎంఎస్ పూర్తయిన తర్వాత ఏడాదికి రూ.5 కోట్ల ప్యాకేజీ వచ్చే అవకాశం ఉందని సాయిసాకేత్ తాతయ్య శంకర నారాయణ తెలిపారు.

## రైలు ప్రయాణికులకు తీపికబురు.. ఆ మూడు స్టేషన్లల్లో పలు రైళ్లకు స్టాపింగ్..



రైలు ప్రయాణికులకు ముఖ్య గమనిక. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని రైల్వే బోర్డు ఓ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాల్లో మూడు స్టేషన్లలో పలు రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించింది. కరోనా సమయంలో ఇక్కడ ఆయా రైళ్లకు స్టాపింగ్ నిలిపివేశారు. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొనడటంతో స్టాపింగ్ అవకాశం కల్పిస్తున్నారు. వీటిలో రాజంపేట, నందలూరు, కోడూరు రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లావాసులకు రైల్వే బోర్డు గుడ్ న్యూస్ చెప్పింది. పలు ప్రధాన రైళ్లకు ఈ జిల్లాలోని మూడు రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ కోసం అవకాశం కల్పించింది. కొవిడ్ సమయం తర్వాత రాజంపేట , నందలూరు , కోడూరు రైల్వేస్టేషన్లలో పలు రైళ్ల స్టాపింగ్‌ను రైల్వే అధికారులు రద్దు చేశారు. కరోనా సమయం పూర్తై దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత దశలవారీగా పలు రైళ్లకు స్టాపింగ్ అవకాశం కల్పిస్తున్నారు. తాజాగా మరికొన్ని రైళ్లను రాజంపేట, కోడూరు, నందలూరు రైల్వేస్టేషన్లలో నిలిపేందుకు రైల్వే బోర్డు చర్యలు తీసుకుంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ పదో తేదీ (బుధవారం) నుంచి అమల్లోకి వస్తుందని రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది. రైల్వే బోర్డు తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం లోకమాన్య తిలక్ - చెన్నై ఎక్స్‌ప్రెస్ (12163), ముంబై - నాగర్ కోయిల్ (16351, 16352) ఎక్స్‌ప్రెస్ రైలు ఇకపై రాజంపేట, కోడూరు రైల్వే స్టేషన్లలోనూ ఆపుతారు. అలాగే పుణె - కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381), కన్యాకుమారి - పుణె ఎక్స్‌ప్రెస్ (16382) రైళ్లను ఇకపై నందలూరు రైల్వేస్టేషన్‌లోనూ ఆపేలా చర్యలు తీసుకున్నారు. తిరుపతి కొల్హాపూర్ మధ్య నడిచే తిరుపతి కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు (17415,17416) రాజంపేట, ఓబుళవారిపల్లె రైల్వేస్టేషన్లలో ఆగుతుంది. ఛత్రపతి శివాజీ టెర్మినల్ - చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలును (22157, 22158, 22159) రాజంపేట, కోడూరు రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ సౌకర్యం కల్పించారు.

## గ్యాస్ సిలిండర్‌పై ఉండే కోడ్ అర్థమేంటో తెలుసా.. ఆ డేట్ ఇలా చెక్ చేసుకోవచ్చు

ప్రతి గ్యాస్ సిలిండర్‌కు ఒక టెస్ట్ డ్యూ డేట్ ఉంటుందని మీకు తెలుసా? సిలిండర్‌పై ఉండే కోడ్ ద్వారా అది ఎప్పుడు తయారు అయిందో తెలుసుకోవచ్చు. ఆ కోడ్‌లో ఆంగ్ల అక్షరాలు, సంఖ్యలు ఉంటాయి. గ్యాస్ సిలిండర్ తీసుకునే సమయంలో ఈ కోడ్‌ను గమనించడం ద్వారా సిలిండర్ ఎప్పుడు పరీక్షించారో తెలుసుకోవచ్చు. ఒకవేళ టెస్ట్ డ్యూ డేట్ ముగిస్తే.. దానిని రీఫిల్లింగ్ కోసం పంపే ముందు మళ్లీ టెస్ట్ చేస్తారు.

ప్రతి ఒక్కరి ఇంట్లో గ్యాస్ సిలిండర్ చాలా కీలకం.. ప్రతి నెలా అవసరాన్ని బట్టి మనం బుక్ చేసుకుంటూ ఉంటాం. గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి ఓ టెస్ట్ డ్యూ డేట్ ఉంటుందని మీకు తెలుసా. అవును మీరు వింటున్నది నిజమే.. గ్యాస్ సిలిండర్‌కు కూడా డెస్ట్ డ్యూ డేట్ ఉంటుంది. ఈ విషయం చాలామందికి తెలియదు.. అందుకే గ్యాస్ సిలిండర్‌పై టెస్ట్ డ్యూ డేట్ గమనిస్తే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్యాస్ సిలిండర్ల మీద ఒక కోడ్ ఉంటుంది.. సిలిండర్ పైభాగంలో హ్యాండిల్‌కు దగ్గరగా ఈ కోడ్ ఉంటుంది. ఇది సిలిండర్ ఎప్పుడు తయారు అయిందో తెలుపుతుంది. ఆ కోడ్‌లో ఆంగ్ల అక్షరాలు, సంఖ్యలు ఉంటాయి. ఒక్కో ఆంగ్ల అక్షరాన్ని (ం,ః,అ,ఆ) మూడు నెలలుగా విభజించారు. దాని పక్కను ఉండే నంబర్ అది ఏడాదిని సూచిస్తుంది. సిలిండర్‌పై ఉండే కోడ్‌లో 'ం' అంటే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలు. 'ః' అంటే ఏప్రిల్, మే, జూన్ నెలలు. 'అ' అంటే జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు. 'ఆ' అంటే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు. సంఖ్య సంవత్సరాన్ని సూచిస్తుంది.. ఉదాహరణకు "ం24" అని ఉంటే, ఆ సిలిండర్ 2024 జనవరి, ఫిబ్రవరి లేదా మార్చి నెలలో టెస్ట్ చేశారని అర్థం. ఇలా సిలిండర్ తీసుకునే సమయంలో ఈ కోడ్‌ను చూడాలి.. అప్పుడు ఆ సిలిండర్ ఎప్పుడు టెస్ట్ చేశారో తెలుసుకోవచ్చు అంటున్నారు. ఇప్పుడు ఏ-26 అని రాసి ఉంటే.. 2026 జనవరి నుంచి మార్చి మధ్యలో ఆ గ్యాస్ సిలిండర్ టెస్ట్ డ్యూ డేట్ ముగుస్తుందని అర్థం. అయితే ప్రజలు ప్రతి నెలా సిలిండర్ తీసుకునే సమయంలో కచ్చితంగా దాని మీద టెస్ట్ డ్యూ డేట్ సూచించే కోడ్‌ను గమనించొచ్చు. ఖాళీ సిలిండర్లను రీఫిల్ చేసే ముందు డ్యూ డేట్ ముగిస్తే దానిని మరోసారి టెస్ట్ చేస్తారు.. ఒకవేళ టెస్ట్ డ్యూ డేట్ ముగిసిన తర్వాత ఆ సిలిండర్‌ను రీ ఫిల్లింగ్ కోసం ఉపయోగించొచ్చా లేదా అనేది చెక్ చేస్తారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న శ్రీమతి బుట్టా రేణుక దంపతులు.





.విభారే న్యూస్ సెప్టెంబరు 09 ఎమ్మిగనూరు...మంగళవారం రోజు పట్టణంలోని కోసిగి రోడ్ లో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మిగనూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ.ఈ కార్యక్రమంలో పాల శ్రీనివాసరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు,పట్టణ యువజన విభాగం అధ్యక్షులు బోయరాజు,పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షులు నాగేంద్ర, పట్టణ మహిళా అధ్యక్షురాలు లతా రెడ్డి, జిల్లా అంగన్వాడి సెక్రటరీ శారదమ్మ, మోనే హర్ష,2 వార్డ్ ఇంచార్జ్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


## అన్నా క్యాంటీన్ తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్...




విభారే న్యూస్ సెప్టెంబరు 09 ఎమ్మిగనూరు..మంగళవారం రోజు మునిసిపల్ కమిషనర్ ఎన్. గంగి రెడ్డి పట్టణం లోని సోమప్ప సర్కిల్ నందు గల అన్న క్యాంటీన్ నందు అల్పాహారం పంపిణీ తనిఖీ చేసి ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరిగింది.

### నేడు సూర్య దేవాలయంలో సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ..

విభారే న్యూస్ సెప్టెంబర్ 9 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో సంకష్టహర చతుర్థిప్రదోష పూజ 10/09/2025 అనగా విశ్వావసు నామ సంవత్సరం, భాద్రపద మాసం, బుధవారము శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి "సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ" విశేషముగా జరుగును.వరసిద్ధి వినాయక స్వామి వారిని పూజిస్తే అనుకున్న పనులు వెంటనే జరుగుతాయి ఏ కార్యం తలపెట్టిన విఘ్నాలు రావు, మీ జాతకం లో బుధ, కేతు గ్రహాలు కలిగించు ఆటంకాలు తొలగిపోయి శుభ ఫలితాలను ప్రసాదించును. అటువంటి స్వామి వారికి ఈ రోజున ఉదయం 10:30 గం"లకు లక్ష్మీ గణపతి మూల మంత్ర సహిత లక్ష్మీ గణపతి హోమం జరుగును. సాయంకాలము 6:00 గంటలకు పంచామృత అభిషేకం,సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ జరుగును. ఇందు భక్తులు విశేషముగా పాల్గొని శుభ ఫలితాలు పొందగలరు. సమయపాలన పాటించగలరని మనవి.సంకటహర చతుర్థి ప్రదోష పూజ 200 /-హోమ సంకల్పం 116 /- విశేషంగా ప్రధాన హోమం 2500/-సంప్రదించవలసిన ఫోన్ నెం:-ప్రద్యుమ్న కుమార్ శర్మ గుండంపాటి:-9440616198.దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్..8896123777.ఆఫీసులో ల్యాండ్ ఫోన్ నెంబరు..08518-234388



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రిన్స్ సేవా సమితి ఘన సన్మానం..

*ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైంది : ఎంఇఓ ఆంజినేయులు, రాజారాంమోహన్...*

విభారే న్యూస్ సెప్టెంబరు 09 ఎమ్మిగనూరు..సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మించిన వృత్తి మరేదీ లేదని, ఈ వృత్తి ఎంతో గొప్పదని ఎమ్మిగనూరు ఎంఇఓ ఆంజినేయులు, పత్తికొండ ఎంఇఓ రాజారాం మోహన్ లు అన్నారు. ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో 27 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్థానిక జూనియర్ కళాశాల వేదికపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన నాగేంద్ర కుమార్, వ్యాయమ ఉపాధ్యాయులుగా నరసింహరాజు, దోర్నాల శ్రీనివాసులతో పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 విభాగంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు కార్యదర్శిగా ఎన్నికైన కమ్మరి రాఘవేంద్ర లను ఎంఈఓ ఆంజినేయులు, రాజారాంమోహన్, ప్రిన్స్ సేవా సమితి అధ్యక్షుడు వహాబ్, బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుడు, ఫుట్ బాల్ అసిసియేషన్ అధ్యక్షుడైన వాల్మీకి రామకృష్ణ నాయుడు ల చేతుల మీదుగా శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం వారు



మాట్లాడుతూ..ఉత్తమ సేవలు అందించినప్పుడు ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు లభిస్తుందని కొనియాడారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపును పొందాలని కోరారు. ప్రతి వ్యక్తికి తల్లి తండ్రి తర్వాత మూడో దైవం గురువేనని పేర్కొన్నారు. సన్మాన గ్రహితులు నరసింహారాజు, రాఘవేంద్ర, కుమార్, శ్రీను లు మాట్లాడుతూ సమాజంలో ఎన్నో సేవలు అందిస్తున్న వహాబ్ బాష అలియాస్ ప్రిన్స్ వహాబ్ ను ప్రత్యేకంగా కొనియాడారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లుక్మాన్, వై.ఎఫ్.సి కోచ్ మాబుసాబ్, హెడ్ మాస్టర్ నాగరాజు, శ్రీధర్, ఎన్.ఐ.ఎస్ సభ్యుడు ఈరన్న, పియిటీలు వెంకటేష్, లతీఫ్, బసవరాజు,శ్రీరామ్, అథ్లెటిక్ కోచ్ మల్లి, కర్ణాకర్ రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి హత్య కేసు ను చేధించిన కర్నూలు త్రీ టౌన్ పోలీసులు.

విభారే న్యూస్ సెప్టెంబర్ 9 కర్నూలు జిల్లా ప్రతినిధి..ఒకరు అరెస్టు.రోకలి బండ, బంగారు ఆభరణాలు, బ్యాంకు పాసుపుస్తకాలు, చెక్ బుక్ లు స్వాధీనం.నిందితురాలి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు వెల్లడించిన... కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్. కర్నూలు లో ఈనెల 1 వ తేదీ జరిగిన కర్నూలు టౌన్ , గణేష్ నగర్ కు చెందిన కాటసాని శిలలీల (75) హత్య కేసును కర్నూలు త్రీ టౌన్ పోలీసులు చేధించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్, కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్, కర్నూలు త్రీ టౌన్ సిఐ శేషయ్య, కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడుతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిందితురాలి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.ఇంట్లో పని మనిషి కురువ వరలక్ష్మి (49) హత్య చేసి శివలీల ఒంటి పై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని వెళ్లినట్లు తెలిపారు.మెయిన్ రోడ్డు లో ఉన్న సీసీ టీవీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితురాలిని గుర్తించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.జిల్లాలో 5 వేల సిసి కెమెరాలను





ఇటీవల కాలంలో ఏర్పాటు చేశామన్నారు.కర్నూలు పట్టణంలోనే 2 వేల సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. నిందితురాలి వేలిముద్రలు ఘటన జరిగిన ప్రాంతంలో గుర్తించామన్నారు. శివలీలను రోకలి బండతో తలపై కొట్టి హత్య చేసిందన్నారు. ముద్దాయి నుంచి 11 తులాల బంగారు ఆభరణాలు , బ్యాంకు పాసు పుస్తకాలు,చెక్ బుక్ లు,హత్య కు ఉపయోగించిన రొకలి బండను స్వాధీనం చేసుకున్నారు.ఈ ప్రెస్ మీట్ లో జిల్లా ఎస్పీతో పాటు కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్, కర్నూలు త్రీ టౌన్ సిఐ శేషయ్య,కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు,పోలీసు సిబ్బంది ఉన్నారు. కేసును త్వరితగతిన చేధించిన పోలీసు అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ అభినందించిన రివార్డులు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, శేఖర్ బాబు, ప్రతాప్ కుమార్. కానిస్టేబుల్స్ నాగరాజు, చంద్రబాబునాయుడు, పరమేశ్వరుడు, సమీర్, రాముడు,వీరబాబు, హోంగార్డు ఇబ్రహీంలను జిల్లా ఎస్పీ అభినందించారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు నాగేంద్ర కుమార్ కు ఘన సన్మానం చేసిన పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు..

ఎమ్మిగనూరు విభారే న్యూస్ సెప్టెంబర్ 9..కనకవీడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడు గా పనిచేస్తున్న నాగేంద్ర కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన సందర్భంగా పాఠశాలలో నిన్నటి దినం ఉపాధ్యాయ సిబ్బంది ప్రదానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది.మా పాఠశాల నుండి మా తోటి ఉపాధ్యాయుడు నాగేంద్ర కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నిక కావడం మా పాఠశాల కు మరియు మా కనకవీడు గ్రామానికే గర్వకారణం అని ప్రదానోపాద్యాయులు శ్రీనివాసులు తెలియజేశారు...పాఠశాల విద్యార్థుల కోసం,వారి విధ్యాభివృద్ధి నిరంతరం పాటుపడేవారని , సామాజిక




సేవా కార్యక్రమాలలో కూడా నాగేంద్ర కుమార్ ఎప్పుడూ ముందుండే వారని ప్రదానోపాద్యాయులు కొనియాడారు.ప్రతి తరగతి విద్యార్థులు నాగేంద్ర కుమార్ సార్ ని సన్మానించడం చాలా ఆనందంగా సంతోషంగా ఉందని, సార్ పట్ల పిల్లలకు గల ప్రేమ, ఆపాయ్యతలకు ఇది నిదర్శనం అని తెలియజేశారు.కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు యల్లప్ప , విజయ్, రాము,శంకర్ , వెంకటేశప్ప ,రాజశేఖర్, గురు, నాగరాజు, శ్రీరాములు, రామాంజనేయులు ,విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ర్యాలీ..





ఆదోని విభారే న్యూస్ సెప్టెంబర్ 9..నిన్నటి దినం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మాజీ పార్లమెంటు సభ్యురాలు, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసుదన్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై ఆదోనిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయం దగ్గరకు రైతులు, పార్టీ నాయకులతో, కార్యకర్తలతో కలిసి భారీ సంఖ్యలో ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.శ్రీమతి బుట్టా రేణుక మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు దీనమైన పరిస్థితిలో ఉన్నారని, రైతులకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని,యూరియా, ఎరువులు దొరకక రైతులు లైన్ లో నిలబడితే మంత్రి ఎగతాళిగా బఫే కొరకు నిలబడ్డారని మాట్లాడుతారని, రైతులకు సరైన సమయంలో ఎరువులు దొరకక పంట పండించకపోతే మనకు తినడానికి తిండి కూడా దొరకదని, పండించిన పంటకు ఉల్లి,పొగాకు,మిరప పత్తి పంటలకు సరైన ధరలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని కుటుంబ ప్రభుత్వపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలకు విశేష స్పందన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ,సెప్టెంబర్ 09:కళారాధన నంద్యాల ఆధ్వర్యంలో, నంద్యాల లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో జరుగుతున్న మాతృభూమికి కళార్చన పోటీలలో భాగంగా మంగళవారం వ్యాసరచన పోటీలు ఉత్సాహంగా జరిగాయి.తెలుగులో "స్వర్ణాంధ్ర – ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మీ ఆలోచనలు", ఆంగ్లంలో "సమాజంలో పెరుగుతున్న అవినీతి, దాని ప్రభావం, ఎలా నిరోధించాలి", హిందీలో "స్ఫూర్తి కలిగించే నచ్చిన గొప్ప దేశ నాయకుని జీవిత విశేషాలు" అంశాలపై జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 500 మంది వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, సహాయ కార్యదర్శి డిసిపి శర్మ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, సభ్యులు మజీద్, మధు వెంకటేశ్వర్లు, సూర్య, ఇస్మాయిల్ పోటీలను పర్యవేక్షించారు.రాబోయే పోటీలు: బుధవారం – తెలుగు, ఆంగ్ల భాషలలో వక్తృత్వ పోటీలు.ఉదయం 10 గంటలకు తెలుగులో "విద్యార్థి దశలో చదువుతో పాటు కలలు మరియు క్రీడల ప్రాధాన్యత".మధ్యాహ్నం 2 గంటలకు ఆంగ్లంలో ''కృత్రిమ మేధ ప్రయోజనాలు, దుష్పరిణామాలు".గురువారం – హిందీ వక్తృత్వ పోటీ.మధ్యాహ్నం 12 గంటలకు "దేశ రక్షణలో సైనికుల త్యాగ నిరతి".

## అనుమానపు వలలో అమాయిక భార్య బలి---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 09-నంద్యాలలో దారుణం జరిగింది. భార్యపై అనుమానంతోనే భర్త హత్యకు పాల్పడ్డాడు.టూ టౌన్ సీఐ అస్రార్ బాషా తెలిపిన వివరాల ప్రకారం? నంద్యాల ఎన్జీవో కాలనీలో నివాసముంటున్న సాయినాథ్ శర్మ (పురోహితి) తన భార్య శిరీషను తెల్లవారుజామున గొంతు కోసి హత్య చేశాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవని, ముఖ్యంగా కుటుంబ అప్పులు పెరగడంతో ఇరువురి మధ్య కలహాలు మరింత ఎక్కువయ్యాయని తెలిపారు. నిన్న రాత్రి కూడా వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆవేశానికి లోనైన భర్త భార్యను కిరాతకంగా హత్య చేశాడు.ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**